# రైడ్ పార్టీ

— డి. హరినాథరెడ్డి

రైడ్ పార్టీకి అక్కప్ప దొరికిపోయింది.

రైడ్ పార్టీ అంటే పోలీసువారు కాదు; అక్కప్ప రంకుతనం చేసి పట్టుపడనూలేదు.

అక్కప్ప దొంగతనంగా సారా వ్యాపారం చేస్తోంది; చేస్తూ రైడ్ పార్టీకి దొరికిపోయింది. దొంగ సారా పట్టుకున్న రైడ్ పార్టీ దొరగారు వరహాలరాజు, దొంగ అక్కప్ప!

* * *

వరహాలరాజు ఎలా ఉంటాడనగా—

ఎత్తుగా, లావుగా, భారీగా, గంభీరంగా —సెవంటీ యమ్. యమ్. స్క్రీన్‌లా వుంటాడు. అతనిగొంతు ఫుల్ స్టెరీఫోనిక్ సౌండులా ఖంగు ఖంగు మంటుంది. అతను నడిస్తే కొండ కదిలినట్టు, ఏనుగు నడుస్తున్నట్టు వుంటుంది. హుందాగా వుంటుంది రీవిగా వుంటుంది.

వరహాలరాజు నిజంగా వరహాలరాజే.

అతనికి బోల్డు ఇల్లు, పెద్ద వ్యాపారం చాలా భూములూ వున్నాయి.

తాళికట్టిన పెళ్లాం ఒకర్తేగాని పక్కమీద పడతులు బోల్డుమంది.

ఇరవైఏళ్ళ కిందట ఇరవై ఆరేళ్ళ వరహాలరాజు వొరి వరహాలరాజు. అప్పుడు రాజుకి చెప్పుకోడానికి ఒక మామ్మ మాత్రం వుండేది. జేబులో చిల్లికానీ వుండేది. కమీజు మీద చిరుగులుండేవి. తలనిండా కురుపులుండేవి. అంచేత వరహాలరాజు మామ్మ ప్రతినెల వరహాలరాజుకి గుండు కొట్టించేది. అపుడంతా వరహాలరాజుని బోడిరాజని పిలిచేవారు. బోడిరాజుకి మామ్మ తప్పించి మరో ఆస్థిలేదు. మరో దిక్కులేదు.

బోడిరాజు మామ్మ దగ్గర మాత్రం మామ్మలాగే పనికిరాని బోల్డు పోరంబోకు భూమివుండేది, ఆ భూమిని ఎవర్నయినా వూరికే, వట్టినే తీసుకోరా బాబ్బాబని బతిమిలాడినా తీసుకోరని బోడిరాజుకి బోడిరాజు మామ్మకీ తెల్సు. అంచేత భూమివున్నా లేనట్టే అనుకున్నారు. ఆ భూమి గురించి పట్టించుకోవడం మానేశారు.

కాని గవర్నమెంటు పట్టించుకుంది. ఆ భూమి ఫ్యాక్టరీ కట్టడానికి చాలా అనువైన అనుకూలమైన స్థలమంది. దాంతో బోడిరాజు, బోడిరాజుమామ్మ తినిపించే వాళ్లకు తినిపించి పైసాకూడా చేయని భూమికి చదరపుగజానికి ఇరవై రూపాయల చొప్పున ఒక లకారంలో సగం లాగడం జరిగింది.



ఆ యాభై వేలు ఒక్కసారిగా చూశ్లేక భరించలేక గుండెలు తిరగబడిపోయి రా అంది ముసిలిముండ. శని విరగడయిం దనుకున్నాడు బోడిరాజు—కాదు వేలరాజు. ఫ్యాక్టరీ పెద్దది కావడంవల్ల మిగిలే స్థలానికి మంచి డిమాండు వచ్చింది. వేలరాజు ఆ స్థలానికి ప్లాటులు వేసి చదరపు గజం ముప్ఫయిమూడు రూపాయల చొప్పున అమ్మి వేలరాజుల్లా లక్షలరాజయ్యేడు.

ఈ బిజినెస్ చాలా బాగుందను కున్నాడు. పనికిరాని భూములు ఎక్కడెక్కడివో కొనడం ఆ భూమికి గిరాకీ రావడంతో కొన్న ఖరీదుకి నాలుగైదు రెట్లకి అమ్మడం, భూమిని ప్లాట్లువేసి అమ్మడం, ఇల్లు కట్టి అద్దెకివ్వడం ఈ విధంగా సాగించాడు వ్యాపారం.

వ్యాపారం మూడు పూవులు ఆరు కాయల్లా వుండటం వల్ల అతని అసలు పేరు అతన్ని అడగకుండానే వరహాల్రాజని తెల్సుకొని, వరహాల్రాజుగారిని' కూడా అనలేక భయభక్తులతో బాబుగారనీ అయ్యగారనీ మాత్రమే అనగల్గుతున్నది ప్రజలు.

సరిగ్గా ఆ సమయంలోనే సారాపాట కులుకుతూ వచ్చింది.

దాన్నెందుకు వదిలేయాలా అను కున్నాడు అంతే. స్వాధీనమైపోయింది. ఆ పట్నానికి సారాకాంట్రాక్టు తనే తీసు కున్నాడు.

అప్పట్నించి, ఆ పట్నంలో ప్రతి ఏడాది వరహాల్రాజుదే పాట. అయిదు లక్షల పాట.

కాని ఈ ఏడాది ఎవడోఏదో పూర్నించి, చాలా దూరంనుంచి, లాభాలు జేబులో నింపుకుందామని వచ్చి పాట అయిదున్నర లక్షలకు పెంచేడు.

ఎవడో కోన్ కిష్కాయ్‌గాడు తన మీద పోటీ వచ్చినందుకు వరహాల్రాజు ఒళ్లు బాగా మండిపోయింది. మండిపోయి ఆరు లక్షలన్నాడు. ఆ దెబ్బతో కోన్ కిష్కాయ్‌గాడు ముఖం వెనక్కి తిప్పి రైలు ఎక్కేశాడు.

ఆ తర్వాత వరహాల్రాజు వచ్చేలాభం దెబ్బతినకుండా వందగ్రాముల సారాకి ఇరవైపైసలు చొప్పున పెంచేడు—జీతాలు పెంచితే ధరలు పెరిగినట్టు.

సారా ఖరీదు పెరిగినా తాగుబోతులు తు. చ. తప్పకుండా తాగుతూనేవున్నారు. వరహాల్రాజు వ్యాపారం సజావుగా సాగు తూనేవుంది.

అయినా పట్నంలో ఎవరూ దొంగ సారా, నాటుసారా, అమ్మకుండా చూడ్డా నికి తనే ఒక 'రైడ్ పార్టీ'ని తయారు చేశాడు వరహాల్రాజు. రైడ్ పార్టీలో వుంటారు వందమంది. వందమందిని పది బేచీలుగా చేశాడు. రోజూ పది బేచీలు పది మూలల కెళ్తాయి. మూలమూలలా గాలిస్తాయి.

రైడ్ పార్టీకి ఎలాంటి యూనిఫారం లేదు. వాళ్ళు ఎవరింట్లోనైనా వెదకొచ్చు. ఎవరమ్మినా పట్టుకోవచ్చు. రైడ్ పార్టీని ఎవరూ ఏమీ అనడానికి వీల్లేదు. ఎవడైనా ఏమైనా అంటే వాడికి భూమ్మీద మరిక నూకలు చెల్లు. పవరులోనున్న వరహాల్రాజు రైడ్ పార్టీకి ఫుల్ పవర్సు ఇచ్చేడు.

రైడ్ పార్టీలో ఒక్కొక్కడి జీతం ఒక్కొక్క వంద. రైడ్‌పార్టీలో వాళ్ళంతా

అవారాగాళ్లు, పచ్చిబేవార్సుగాళ్ళూనూ.

అదీ రైడ్ పార్టీ సంగతి. అదీ వర హాల్రాజు చరిత్ర.

వరహాల్రాజు పరిస్థితులను క్రియేట్ చేయగలడు; ఏ విధంగా కావాలనుకుంటే ఆ విధంగా పరిస్థితులను మార్చగలడు. కాని—

అక్కప్ప పరిస్థితులను క్రియేట్ చేయలేదు; మార్చలేదు. పరిస్థితులే అక్కప్పను అధ్వానంగా క్రియేట్ చేయ గలవు. నీచంగా మార్చగలవు.

* * *

అక్కప్పకు భర్తవున్నంత కాలం ఇల్లు కదలవలసిన పనిగాని పరాయి మగాడివైపు కన్నెత్తి చూడవలసిన అవ సరంగాని లేకపోయింది. భర్త తెచ్చిన జీతం తక్కువైనప్పటికే దానితోనే సర్దుకు పోతూ యింటిని చక్కగా చక్కబెట్టు కునేది.

కాని—

ఆ రోజునుంచి అక్కప్ప జీవితం అంధకార బంధురం అయిపోయింది, అవును.

ఆరోజు—

అక్కప్ప మగ బిడ్డను కన్నది. అక్కప్పకెంతో ఆనందమైపోయింది. వరుసగా తను మూడు సార్లు ఆడపిల్ల లనే కన్నది. కాని మావఁ (భర్త) మగ పిల్లాడు పుట్టడం లేదని మూడుసార్లు మూతి ముడ్చేసుకున్నాడు. ఈసారి కొడుకు పుట్టాడని వార్తవిని మావఁ ఎంత మురిసి పోతాడో—అక్కప్ప మురిసిపోయింది ముందు.

కొడుకు పుట్టేడన్న వార్త అక్కప్ప మొగుడికి చేరింది.

అప్పుడతనున్నది వర్కుషాపులో. అప్పుడు సమయం రాత్రి ఏడుంబావు.

ఉదయం ఆరు గంటలకెళ్లిన వాడు ఇంకా పన్జేస్తూనే వున్నాడు—అది ఓవర్ టైముకాదు.

అక్కప్ప మొగుడు కొడుకు పుట్టేడని చెప్పగానే అభినందనలు తెల్పాడు ప్రొప్రయిటర్.

కొడుకును చూసుకోడానికి పర్మిషన్ ఇమ్మంటే ఆగ్రహంతో చిందులు తొక్కేడు ప్రొప్రయిటర్.


"వీల్లేదు, ముందు పని తర్వాత కొడుకు."

"ఈ ఒక్కసారి మాత్రం సార్. సార్ సార్సార్ సార్."

"త్వరగా జాబ్ కంప్లీట్ చేసి త్వరగా వెళ్లిపో. నాకభ్యంతరం లేదు."

కాని ఆ జాబ్ అంత తొందరగా అవ్వదు. అవ్వదని ఆ ప్రొప్రయిటర్‌కి తెల్సు. అక్కప్ప మొగుడికి ఎలాగూ తెల్సు. తెల్సినా తొందరగా చేద్దామని నిశ్చయించుకున్నాడు. మిషన్ మీద కెక్కాడు. ఉదయం ఆరు గంటలనుంచి పన్జేస్తున్నాడేమో బాగా అలిసివున్నాడు. సొలసివున్నాడు. నీరసంగావున్నాడు. అయినా మొండిగా-కొడుకుని, తన వరాల పంటని వెంటనే చూడాలన్న ఆతృతతో గబగబా పన్జేస్తున్నాడు.

చేస్తుండగా కళ్ళు తిరిగాయి. వళ్ళు వశం తప్పింది. మిషన్‌మీద పడి పోయాడు. మిషన్ రాకాసి అతన్ని లాగేసు కుంది. పళ్ళ చక్రాలతో కొరుక్కుతినే



సింది. మిగతా వర్కర్లు రాకాసి బారినుండి లాగి ఆసుపత్రిలో జాయిన్ చేసేలోగా తోవలోనే చచ్చిపోయాడు అక్కప్ప మొగుడు.

కాని, ప్రొప్రయిటర్ అక్కప్ప మొగుడి హృదయ విదారకమైన చావుకి చాలా విచారించి వందరూపాయిలిచ్చేడు-దహన ఖర్చులికి!

కార్మికులు ఒకరోజు జీతం అందరిదీ కలిపి అక్కప్పకు ఇచ్చేరు. అంతకన్నా వాళ్ళేం చేయగలరు.

ఆ మొత్తం మూడు వందలు.

మొగుడుపోయి మూడొందలొచ్చినందుకు మరోమారు నెత్తి బాదుకుంది అక్కప్ప. అలా ఎంతని ఏడుస్తుంది?

నిన్న మొన్నటి వరకు మొగుడూ, తనూ, పిల్లలు.

ఇప్పుడు మూడొందలూ, తనూ, పిల్లలు.

మొగుడు పోయి వచ్చిన మూడొందలు అవి మొగుడుకన్న వేగంగా పోతాయి. అవి పోకముందే పిల్లలకు ఆధారం చేసుకోవాలి. అవును చేసుకోవాలి? ఈ కరువు కాలంలో, ఈ దరిద్ర దేశంలో, మూడొందలు దేనికి సరిపోతుంది? ఎన్ని రోజులొస్తుంది? దేనికీ సరిపోదు; ఎన్ని రోజులోరాదు గాబట్టి కూలి చేద్దామని నిశ్చయించుకుంది. నిశ్చయించుకుంటే సరా! కూలి దొరకొద్దూ?

కూలిపని ఎక్కడా దొరకలేదు.

తన దగ్గర ఏముందని ఇస్తాడు పని? చదువా, సంధ్యా, వయసా, సొగసా, వంపులా, సొంపులా! ఏముందని ఇస్తారు?

ఆఖరికి అంట్లుతోమే పనికూడా దొరకలేదు. ఈ లోపుగా మూడొందల్లో ఎంత జాగ్రత్తగా ఖర్చుపెట్టినా అయిదు పదులు

ఎగిరిపోయాయి.

గుండెలు బాదుకుంది. గుండెలవిసేలా ఏడ్చింది. తనని చావనీయకుండా పిల్లలు రిస్కులో పెట్టినందుకు పిల్లల్ని తిట్టింది. దబాదబా బాదింది. ఆ వెంటనే పిల్లల్ని వాటేసుకొని వలవలా ఏడ్చింది.

అక్కప్ప ఏడుపు చూశ్ళేని వూళ్లో వాళ్ళ ఉచిత సలహా—'టీ కొట్టు పెట్టి చూడు'

ఆపదకాలంలో ఎటువంటి బోడి సలహా అయినా బోల్డు ఊరడింపు.

అక్కప్ప టీకొట్టు పెట్టింది. పెసరెట్లు కూడా చేసింది. ఎవరో దారిన పోయిన దానయ్య కొనక్కర్లేదు. వూళ్లో వాళ్ళే కొంటే చాలు. కాని వూళ్ళోవాళ్లు సలహా అయితే ఇవ్వగల్గేరుగాని టీలు, పెసరెట్లు కొనలేకపోయేరు. కొందరు మాత్రం దయ తలచి అరువు మాత్రం తీసుకునేవారు.

తర్వాత అరువు పెట్టిన వాళ్ళు రావడం మానేశారు. అక్కప్ప వాళ్ళ దగ్గరకు వెళ్లేది. వెళ్తే గొడవలు తప్పించి డబ్బులు వచ్చేవికావు. అంచేత అతి తొందరలోనే అక్కప్ప టీకొట్టు కుదేల్ అయిపోయింది.

దాంతో మళ్ళీ అక్కప్ప ఏడుపు, రాగాల ఏడుపు, ఏడుపు రాగాలు.

'నా నీ యా పా రం సే య లే ను దేవుడోయ్. దేవుడోయ్, దేవుడా!'

అక్కప్ప చేతుల్ని దేవుడివైపు చాపుతోంది. చాపిన చేతుల్తో దభాల్ని నేలను చరుస్తోంది. నేలను చరిచి నెత్తిని బాదుకుంటోంది. బాదుకుంటూ ఏడుస్తోంది. ఏమని ఏడుస్తుందంటే—

"నానీ పిల్లల్ని పో షిం చ లే ను దేవుడోయ్, దేవుడా, పిల్లల్ని నూతిలో తోసేసి ఆ నూతిలో నానూ పడిపోతాను దేవుడోయ్, దేవుడా, దేవుడా" నన్నా. నా పిల్లల్ని దిక్కుమాల్నాల్లోగా జేసి, నావు దేవుడోయ్. దేవుడా ఏడ్చి ఏడ్చి ఏడుపు మానేక ఆలోచించింది. ఆలోచిస్తూంటే తళుక్కుమని జ్ఞానోదయమైంది అక్కప్పకు.

"ఏలాగైతేటేం నా పిల్లల్ని పెద్దోళ్ళగ సేత్తాను నాను సావను. నా పిల్లల్ని సావనీయను" అని నిర్ణయించుకొని చెదిరిపోయిన జుత్తుని చేతుల్లోకి తీసుకొని, చుట్టి, కొప్పు ముడిచి, లేచి నించుంది అక్కప్ప.

* * *

అందరికీ ఒకే అందం నచ్చదు. ఆకర్షణకూడా అందరికీ ఒకేలా కన్పించదు. కొందరికి లావుపాటి ఆడవాళ్ళంటే ఇష్టం—మరి కొందరికి సన్నపాటి ఆడవాళ్ళంటే ఇష్టం. ఇంకొందరికి కన్నెపిల్లలంటే ఇష్టం. కాని నాగన్నకు పిల్లల తల్లులంటే ఇష్టం. నాగన్నో పిల్ల కంట్రాక్టరు.

నాగన్నను అక్కప్ప ఆకర్షించింది. అక్కప్పలో ఎక్కడో సెక్సు కనిపించింది. అక్కప్పలో మనకు కన్పించని అందాలు ఏవో నాగన్నకు కనిపించేయి. కంపర మెత్తించేయి. కసిని కల్గించేయి.

అక్కప్ప ఇంటికి నాగన్న రోజూ రాత్రి వస్తున్నాడు. రోజుకో నాలుగైదిస్తున్నాడు. తెల్లగా తెల్లారకముందే చడీ చప్పుడు లేకుండా పోతున్నాడు.

అయినా, చీకటైనా చడయింది. చప్పు

ఉయింది. చడీ చప్పుడు లేకుండా రంకుతనం దాగలేదు సాగలేదు కదా! వూరు మధ్యకెళ్లి సారా కంపులా గుప్‌మంది. అక్కప్పను 'ఎలాగోలా' పిల్లల్ని పోషించుకొమ్మని సలహా యిచ్చిన అమ్మలక్కలే అమ్మో! అమ్మో! అని గుండెలు బాదుకున్నారు. 'దానికెంత గుండె ధయిర్నం' అని నోళ్లు నొక్కుకున్నారు. 'అంతమంది పిల్లల్ని కనికూడా ఎంత బరితెగించింది' అని ముక్కుమీద వేలేసుకున్నారు. సూటిపోటి మాటలు అక్కప్ప మీదకు విసరనారంభించారు.

అక్కప్పది భరించలేక రంగంలోకి దిగక తప్పలేదు; పురాణం విప్పక తప్పలేదు.

"అవునే సవుతుల్లారా నాను రంకుదాన్ని. ఏటంతారైతే. నాగన్న నామొగుడు. నా వుంచుకున్నాడు, సరిపోనాదా, సాల్దా. ఎందుకిలా ఏడుత్తారు నామీద. ఆడు మీ ఇల్లకు రాకుండా నాఇంటి కొత్తండనా. మీ పక్కల తొంగోకుండా నాపక్కల తొంగుంటుండనా. సెప్పండి మరి, మీరు నిజంగా రంకోరు కాకపోతే నాగన్న పెళ్లాలు ఒవులైనా వుంటే ఆలొచ్చి నాతో మాటాడండి. నేకపోతే నోరు మూసుకు పొండి, పోతారా నేదా?"

అంతా నోరుమూసుకు పోయేరు—కిక్కురు మనకుండా. అక్కప్ప ఎదురుగా ఇక ఆవూసు ఎత్తడం మానేసి, నవ్వుతూ మామూలుగా మాటాడ్డం మొదలెట్టేరు.

అయితే—

అతికొద్ది తక్కువ కాలంలోనే అక్కప్పపై నాగన్న మోజు తీరింది.



కొత్తదనాన్ని కోరే నిర్మాత ఎ. పూర్ణచంద్రరావు తాజాచిత్రం 'రాజు వెడలె'లో చిత్రమైన గెటప్‌లో కన్పిస్తున్న శోభన్ బాబు.

ఇపుడు నాగన్నకు అక్కప్పలో అందాలు కన్పించడంలేదు. ఆకర్షణ, సెక్సు అంతగా కన్పించడంలేదు. సరిగదా గుడ్డిగా తనే ముసిలిదాని మాయలో పడిపోయాననుకున్నాడు. ఈ లంపటంనుంచి ఎలా తప్పుకోవాలా? అని ఆలోచనలు చేయ నారంభించేడు నాగన్న.

అక్కప్ప తెలివి తక్కువది కాదు. నాగన్న రాకముందే రెండొందల్నీ జాగర్త చేసివుంచింది. ఏ టైము ఎలా వుంటుందా?

రంకు మొగుళ్లు ఎప్పుడూ స్థిరంగా వుండరని అక్కప్ప ఎప్పుడో గ్రహిం

చింది. నాగన్న తనని విడిచేస్తే అక్కప్ప భయమల్లా వాంఛలూ, కోరికలూ, కోకలూ ఇక వుండవనికాదు. తన ఒళ్ళేమి కొవ్వెక్కి లేదు, కోరికలేపుడో చచ్చిసేయి. కోకలు. ముష్టి కోకలు మీద ఇంకా మోజా! కాని పిల్లలు పచ్చులై పోతారు. అనాదులై పోతారు.

"ఇక వుంచుకోను" అనుకొనేవాడు ఎలానూ వుంచుకోడు. ఇంకా వుంచుకో అంటే—మరీ మొండిగా ముందే పారి పోతాడు. అంచేత ఉండమని ప్రాధేయపడి బ్రతిమిలాడ్డం అనవసరం అనుకుంది అక్కప్ప.

కాని తన పిల్లలు బతకటానికి, పిల్లలు కోసం తను బతకటానికి ఏదో దారి మాత్రం చూపించమంది అక్కప్ప అంత కన్నా మరేమి అనలేదు. దాచుకొన్న రెండొందలు కూడా చూపించింది.

ఆలోచించాడు నాగన్న బాగానే వుందనుకున్నాడు నాగన్న. జీడిబంకలా ఎల్లకాలం అంటుకోకుండా, పరువు బజారు కెక్కించకుండా అక్కప్ప ఇంత వేగంగా వదిలేస్తే ఎంత హాయిగా ఊపిరి పీల్చుకోవచ్చును కున్నాడు. అక్కప్ప చూపించమన్న దారికోసం ఆలోచించేడు.

ఆలోచించాడు దారి.

ఆ కొండ పక్కనుంచి .చెట్ల మధ్య నుంచి .... తుప్పల్లోంచి, రాళ్ళరప్పల మీంచి. . పదిమైళ్ళ పొడవున దారి. ఆ పది మైళ్ళ దారి దాటేక . .అక్కడ చిన్న వూరు పక్కన చేలు. . .చేలో బట్టీలు సారా బట్టీలు దొంగసారా బట్టీలు, అక్కడ దొంగతనంగా నాటుసారా వండు తారు. ఆ వండిన సారాని కొందరు దొంగ చాటుగా కొంటారు. కొని బస్తీలో, పెద్ద పల్లెల్లో లాభానికి అమ్ముతారు.

అదే నాగన్న అక్కప్పకు చూపించిన దారి. నాగన్నకి పిల్ల (కాంట్రాక్టులు చేయకముందు, గవర్నమెంటు సారా రాకముందు సారా వ్యాపారం చేసే అను భవం వుంది)

అక్కప్ప ఆ వూరు వెళ్లి దొంగసారా కొంటోంది. కొని తీసుకువచ్చి దొంగ చాటుగా ఇంట్లో అమ్ముతోంది. నాగన్న అక్కప్ప సారాకి కస్టమర్సునికూడా చూపించేడు.

"మావా! నీమేలు జనమజనమలకీ మరిసిపోలేనంది"—అక్కప్ప.

నాగన్నమటుకు అక్కప్పను మర్చి పోయేడు. మరికరావడం మానేసేడు. తాగు బోతుల సంఖ్య క్రమేణ పెరుగుతోంది. ఎందుకు పెరగదూ? అక్కప్ప సారా గవర్నమెంటు సారాకన్నా ఘాటు. గొప్ప నిషా. భలే చౌక.

దొంగతనం కూడా కష్టమైన పనే. కష్టం సగం చెమటకారిస్తే, భయం సగం చెమట కారుస్తుంది, చెమటలు ముచ్చె మటలు కక్కుతూ అక్కప్ప మూడ్రో జుల కొకసారి సారా పట్టుకొస్తుంది

పది మైళ్ళ దూరం. ఆ దూరమంతా కోక గోచికట్టుకట్టి పరుగులాంటి నడక . బయల్దేరేది అర్ధరాత్రి. ఇంటికి చేరేది వేకువజాము. వచ్చే తోవంతా భయం కరంగా వుంటుంది. చిట్ట చీకటి, దారి దారంతా రాళ్ళు రప్పలూ, ముల్లులూ, తుప్పలూ, పాములూ, నక్కల ఈలలూ

దట్టమైన చెట్లూ, భీకర నిశ్శబ్దం .. అయితే వీటివల్ల అక్కప్పకేం భయం లేదు. ఆమె భయమంతా వరహాల్రాజు రైడ్ పార్టీ వల్లే. అక్కప్ప తోవ తోవంతా ప్రతిరాయి, ప్రతిచెట్టూ, ప్రతి కొండా వరహాల్రాజునే భ్రమచెందుతుంది. ప్రతి చిన్న చప్పుడుకీ రైడ్ పార్టీయనే భయపడుతుంది.

ఇంటికి చేరేవరకూ భయం. ఇంటికి చేరినా భయం. ఇంట్లో సారాచెల్లుబడి అయి పోయేవరకూ భయంభయం. చెల్లుబడి అయి పోయేక హమ్మయ్య అనుకుందా మను కుంటే మళ్ళీ నెత్తిన మూట-పొత్తికడుపు కింద చుట్టుకున్న పాములు. దాంతో మళ్ళీ భయం, పిల్లల దొక్కలు నిండడంకోసం. ఇలా బతుకంతా భయం. భయంతో ఊడ్చ వల్సివస్తోంది. అక్కప్ప భయం పోడానికి సారాకూడా సేవిస్తోంది. రైడ్ పార్టీకి దొరకగూడదని రోజూ ఏడుకొండలవాణ్ణి కూడా సేవిస్తోంది.

ఒకరోజు నాలుగురోజులు వారం పది రోజులు నెల రెండు....మూడు నాలుగు నెలలయినా కాలేదు. అంతలోనే కారుచీకట్లు కమ్ముతున్నాయి. గుడ్డి వెన్నెల కాస్తా హరించుకు పోయింది. మేఘాలు ఘర్జించేయి. పిడుగులు పడ్డాయి. వడగళ్ళు రాలేయి. ఉరుములు ఉరిమేయి. అక్కప్ప యిల్లు కుప్పలా కూలిపోయింది. పిల్లలు కేర్‌మన్నారు. అక్కప్ప బావురుమంది.

అక్కప్ప సారా ట్యూబులు రైడ్ పార్టీకి దొరికిపోయింది. అక్కప్ప, అక్కప్ప పిల్లలూ వరహాల్రాజుకి చిక్కి పోయేరు.

* * *




సారాకొట్టు తాలూకా ఆఫీసు. గోడ వారగా కుర్చీ. కుర్చీలో అతి ప్రసన్న వదనంతో వరహాల్రాజు. ఎదురుగా నించొని అక్కప్ప. అక్కప్ప చుట్టూ కోడి పిల్లల్లా అక్కప్ప పిల్లలు. తల్లి బ్రతి మాలుతోంది. పిల్లలు ఏడుస్తున్నారు.

ముందుగా అక్కప్ప సారా ట్యూబుని రైడ్ పార్టీవారు కస్‌కస్‌మని కోసేరు— కాదు వరహాల్రాజు కోయించేడు - కాదు కాదు, అక్కప్ప కడుపుని వరహాల్రాజు కోసేసేడు. ముక్కముక్కలైన సారా ట్యూబుని రోడ్డుమీద పడేశారు.

వరహాల్రాజు అక్కప్పను తిట్టలేదు. 'నీవు చేసింది తప్పు అనికూడా అనలేదు. పిల్లల ఏడుపు ముఖాలవైపు చూపు తిప్ప లేదు. అక్కప్ప ప్రార్థనలను పట్టించు కోవడంలేదు. కాని అతనికి తెగ చిరాగ్గా వుంది. ఆమె ఏడుపు అతన్ని విసిగిస్తోంది. ఆఫ్టరాల్ అక్కప్పతో తను యింత టైము వృధాచేయడం తనని తనే అవమానం

చేసుకోవడం అనుకున్నాడు. వెంటనే వెను వెంటనే తేల్చేయాలనుకున్నాడు.

అంచేత ఒకే ఒకమాట అన్నాడు. 'జరిమానా మూడొందలు కట్టేసిపో?

-అమ్మో! మూడొందలే! తను ఎక్కణ్ణుంచి తేగలదు?

"నాకాడ డబ్బు లేదుబాబు, వుంటే ఈపాడు బతుకు ఎందుకు బతుకుతాను బాబు. తల్లి మాలచ్మి పమానంగా సెబ్తున్నా బాబు. నాకడ దమ్మిడీకూడాలేదు. వున్న డబ్బంతా సారాకే మదుపెట్టేసినాను. ఈ పేద్దాని కనికరించి వొదిలేయ్ బాబు. నాయిన్నాయినా. చచ్చి నీ కడుపున పుడతా.

బాబ్బాబభయ్య.

బాబ్బాబు. నీకాళ్ళొట్టుకుంటాను బాబ్బా బాబ్బాబు

లాభం లేదు.

ఆఖరి సారి.

కట్టుకుంటావా, లేదా?

మరిక లాభంలేదు.

వరహాల్రాజు నిట్టూర్చేడు చిన్నగా. ఫోన్ చేసేడు నెమ్మదిగా. వెంటనే ప్రొహిబిషన్ పోలీసు వ్యాను వచ్చింది. వచ్చి అక్కప్పను తీసుకుపోయింది.

తర్వాత ఏమి జరిగింది. మామూలే కష్టడీ, కోర్టు, జైలు.

చీకటి కొట్లో అక్కప్ప. వల్లకాట్లో అక్కప్ప మొగుడు.

చీకటి యింట్లో బిక్కుబిక్కు మంటూ అక్కప్ప పిల్లలు.

కొట్లోను, వల్లకాట్లోనూ, ఇంట్లోనే కాదు చీకటి సారాకొట్టు దగ్గరకూడా చీకటిగానే వుంది.

అవును చీకటిగావుంది. సారాకొట్టుకెదురుగా లారీ వుంది. లారీనిండా గడ్డి వుంది. లారీలోంచి ఎంత లాగినా ద్రౌపది చీరలా వస్తూనేవుంది గడ్డి. గడ్డి పూర్తిగా తీసేయగానే డ్రమ్ములు! డ్రమ్ములు!

సారాకంపు గుప్‌గుప్ మంటూ ముక్కుల్ని పిండేస్తోంది.

ఆ డ్రమ్ముల్లో సారా చట్ట ప్రకారంగా గవర్నమెంటు ఇచ్చిన కోటాకాదు. చాటు చాటుగా రప్పిస్తున్న దొంగ సారా ఆ డ్రమ్ముల్లో సారా. ఆ లారీ (కాకుంటే అటువంటి మరో లారీ) రావడం రోజూ జరుగుతోంది. (ఇలాంటి కల్తీ సారాలే మనుష్యుల్ని చంపేయడం, అంగవైకల్యాది వ్యాధులు కల్గించడం తరుచూ మనం పేపరో చూస్తున్నదే)

లారీలో కూర్చున్న ఆసామి చేతుల్లోకి.

కిందనున్న వరహాల్రాజు చేతుల్లోంచి నోట్లు, నోట్లు రూపాయల నోట్లు.

నోట్లు సరసర చప్పుడు ముగిసింది.

డ్రమ్ములు కొట్లో కెళ్ళేయి.

ఆ తర్వాత—

వరహాల్రాజు ఇంటికెళ్లి హంసతూలికా తల్పం మీద మత్తుగా తాగి పడుకున్నాడు. కాని నిద్ర సరిగ్గా పట్టడంలేదు. ఈ మధ్య రోజూ ఇలాగే అవస్థగా వుంది. అదేం జబ్బుకాదు. ఇపుడిపుడే దేశంలో సమసమాజం కోసం ప్రజ్వరిల్లుతున్న విప్లవాత్మక పరిణామాల ప్రచండదాడికి తన ప్రాణం, తన ప్రాపర్టీ ఆహుతి అయిపోవుగదా అనే సహజమైన భయంవల్ల వరహాల్రాజుకి నిద్రపట్టని మాట నిజం. ★



సోంవి